


బహిరంగ వేలంలో కాఫీకి మంచి ధర

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: బహిరంగ వేలంలో కాఫీ కి మంచి ధర లభించినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ది విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మాక్స్ సొసైటీ తరపున సహకరించిన కాఫీ అమ్మకానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీఓ రోణంకి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్లో బహిరంగ వేలం నిర్వహిం చారు. ఈ వేలంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మాక్స్ అధీనంలో 135.25 మెట్రిక్ టన్నుల కాఫీ పార్చ్మెంట్, 17.60 మెట్రిక్ టన్నుల కాఫీ ఫ్లోట్ చెర్రీ స్టాక్ ఉన్న విషయం విదితమే. ఈ మేరకు కాఫీ బహిరంగ వేలంలో శ్రీ మోదమాంబ ట్రేడర్స్ వారు అత్యధికంగా వేలంలో పాడి బిడ్ దక్కించుకున్నారు. ఫ్లోట్ చెర్రీ రకం కాఫీ రూ. 142లు, పార్చ్మెంట్ కాఫీకి రూ. 312 ల కు బిడ్ దక్కించుకున్నారు. గతంలో 2020-21లో ఫ్లోట్ చెర్రీ రూ.116 లు, పార్చ్మెంట్ రూ. 294 లకు మాత్రమే లభించింది.

పదిలో మంచి ఫలితాలకు పక్కా ప్రణాళిక

▸▸సబ్జెక్టుల వారీగా ప్రత్యేక పరీక్షలు ▸▸ప్రతి రోజూ స్టడీ అవర్స్

ప్రజాశక్తి-పాడేరుటౌన్: కోవిడ్ మహమ్మారి ప్రభావంతో 2020, 2021లో టెన్త్ పబ్లిక్ పరీక్షలు లేకుండానే విద్యార్థులు తమ భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లారు. ఈ ఏడాది అలా కాకుండా ప్రతి పాఠశాలల్లోనూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టేలా రేయి, పగలు కష్టపడి చదువుతున్నారు. ఉపాధ్యాయులు కూడా తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతూ టెన్త్ పరీక్షల్లో నూరు శాతం సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. టెన్త్ పరీక్షలలో యాక్షన్ ప్లాన్ తో అద్భుత ఫలితాలు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. పదో తరగతి ఈ ఏడాది నుంచి 6 పేపర్లకు కుదించారు. గతంలో ఏడు పేపర్లు ఉండేవి. ఈ ఏడాది నుంచి ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ రెండూ కలిపి ఒకే పేపర్ చేయడంతో ఏప్రిల్ మూడవ తేదీ నుంచి జరిగే పరీక్షలు 6 పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఒక్కో పేపర్ కు 100 మార్కులు చొప్పున ఆరు పేపర్లకు 600 మార్కులు ఉంటాయి. అధికారులు విడుదల చేసిన యాక్షన్ ప్లాన్ జనవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఏజెన్సీ 11 మండలాల్లో జిటిడబ్ల్యుఎహెచ్ఎస్, ఎపిటిడబ్ల్యుఆర్ ఎస్, జిహెచ్ఎస్, కెజిబివిలతో పాటు ఆయా ప్రైవేట్ పాఠశాలల్లోని 7,216 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు.

పాడేరులో 4 పరీక్షా కేంద్రాల్లో 844 మంది, జి మాడుగులలోని 4 పరీక్ష కేంద్రాల్లో 591 మంది, డుంబ్రిగూడలో 3 పరీక్ష కేంద్రాల్లో 568 మంది, ముంచంగిపుట్టులో 2 పరీక్ష కేంద్రాల్లో 317, పెదబయలులో 3 పరీక్షా కేంద్రాల్లో 553 మంది, అనంతగిరిలో 3 పరీక్షా కేంద్రాల్లో 364 మంది, అరకు వ్యాలీలో 3 పరీక్ష కేంద్రాల్లో 595 మంది, కొత్త బళ్ళుగూడ పరీక్ష కేంద్రంలో 302 మంది, చింతపల్లిలో 3 పరీక్ష కేంద్రాల్లో 610 మంది, జికె వీధిలోని 3 పరీక్ష కేంద్రాల్లో 534 మంది, సీలేరులోని పరీక్ష కేంద్రంలో 116 మంది, కొయ్యూరులో 3 పరీక్ష కేంద్రాల్లో 645 మంది, హుకుంపేటలో 4 పరీక్ష కేంద్రాల్లో 559 మంది, అనంతగిరి మండలం శివలింగపురంలోని 2 పరీక్షా కేంద్రాల్లో 332 మంది, హుకుంపేట మండలం బాకూరు పరీక్ష కేంద్రంలో 145 మంది, ముంచంగిపుట్టు మండలం జోలపుట్టులోని పరీక్ష కేంద్రంలో 141 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. పరీక్షలు దగ్గర పడే కొద్దీ విద్యార్థుల్లో టెన్షన్ పెరుగకుండా విద్యార్థులకు దిశనిర్దేశం చేస్తూ వారిలో టెన్షన్ ను పోగొట్టి ధైర్యం నింపుతున్నారు.

స్టడీ అవర్స్ ముఖ్య పాత్ర

పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులతో పాటు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ పరీక్షలను కూడా నిర్వహిస్తూ రోజుకు వారిలోని ప్రతిభ మెరుగు పరుస్తున్నారు. టెన్త్ క్లాస్ విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఏర్పాటు చేసిన స్టడీ అవర్స్ మంచి ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని సబ్జెక్ట్ ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఐటిడిఎ అధికారుల ఆదేశాలతో యాక్షన్ ప్లాన్లో భాగంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది.



కందమామిడి బాలికల పాఠశాలలో స్టడీ అవర్ ను పర్యవేక్షిస్తున్న టీచర్స్

లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక కృషి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లక్ష్యాన్ని సాధించేం దుకు నిరంతర కృషి చేస్తున్నాం. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా తగు జాగ్రత్తలతో మంచి నాణ్యమైన బోధనలతో యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేస్తున్నాం. ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేలా సన్నద్ధం చేస్తున్నాం.

మీనాక్షి,స్కూల్ అసిస్టెంట్ సైన్స్,
జిటిడబ్ల్యు ఆశ్రమ బాలికల పాఠశాల, కందమామిడి.

యాక్షన్ ప్లాన్తో అధిక ప్రయోజనం

సిలబస్ పూర్తి చేసి జనవరి 1వ తేదీ నుంచి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించడం, అదే సబ్జెక్టుల్లో మరుసటి రోజు పరీక్షలు నిర్వహించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. అలాగే ఒక వైపు రివ్యూ నిర్వహిస్తూ ఆరు పేపర్లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

కె.అరుణ
స్కూల్ అసిస్టెంట్ తెలుగు
జిటిడబ్ల్యు ఆశ్రమ బాలికల పాఠశాల, కందమామిడి.

జిల్లావ్యాప్తంగా టెన్త్ విద్యార్థుల వివరాలు:

మేనేజ్ మెంట్	స్కూల్స్	స్టూడెంట్స్
ఎయిడెడ్	2	35
గవర్నమెంట్	12	532
ట్రైబల్ వెల్ఫేర్	159	7416
కెజిబివి	19	694
ప్రైవేట్	17	409
ఎపిటిడబ్ల్యు ఆర్ఎస్	16	1243
జిల్లా పరిషత్	31	1193
మొత్తం	225	11522



కేసు వివరాలు వెల్లడిస్తున్న భద్రాది కొత్తగూడెం జిల్లా ఎస్పి వినీత్

మావోయిస్టు దళ సభ్యుల అరెస్టు

ప్రజాశక్తి-చింతూరు

తెలంగాణ- చత్తీస్ఘడ్ రాష్ట్ర సరిహద్దులోని తెలంగాణ రాష్ట్రం పైడిగూడెం అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు పామేడు దళం సభ్యులను, ఒకరు సానుభూతిపరుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. భద్రాది కొత్తగూడెం జిల్లా ఎస్పి జి.వినీత్ శుక్రవారం కేసు వివరాలను మీడియాకు తెలియజేశారు. ఎస్పి కథనం ప్రకారం... పైడిగూడెం అటవీ ప్రాంతంలో దుమ్ముగూడెం పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ 212 బెటాలియన్, సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా, మావోయిస్టు పార్టీ పామేడు దళం సభ్యులైన చత్తీస్ఘడ్ రాష్ట్రం, కిష్టారం పోలీసు స్టేషన్ పరిధి కామారం గ్రామానికి చెందిన సోడే కామే, సోడి బందు, సానుభూతిపరుడు సోడి చంటిని అరెస్టు చేశారు. సోడి కామే, సోడి బందు ఐదేళ్లగా మావోయిస్ట్ పార్టీ పామేడు దళ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరు తెలంగాణ- చత్తీస్ఘడ్ రాష్ట్ర మావోయిస్టు పార్టీ సభ్యులతో కలిసి అనేక సంఘటనలలో పాల్గొన్నారు. వీరిపై పలు కేసులు ఉన్నాయి. పోలీసులను చంపాలనే ఉద్దేశంతో ల్యాండ్ మైన్స్ ఏర్పాటు చేయడానికి పైడిగూడెం అటవీ ప్రాంతానికి వచ్చినట్లుగా అరెస్టయిన ముగ్గురు అంగీకరించారు. వారి నుండి జిలెటర్ స్టిక్స్-10, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు-4, కార్డెక్స్ వైర్ 20 మీటర్స్, ఎలక్ట్రిక్ వైర్-50 మీటర్లు, బ్యాటరీలు-1, స్టీల్ బకెట్-1 పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు పార్టీకి ఎవరైనా సహకరిస్తే, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మీడియా సమావేశంలో ఓఎస్డి సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, సిఆర్పిఎఫ్ 141 బిఎన్ కమాండెంట్ కమల్ వీర్, డిప్యూటీ కమాండెంట్ అజయ్ ప్రతాప్, సీఐ రమేష్ పాల్గొన్నారు.



మావోయిస్టులు దగ్ధం చేసిన ప్రొక్లెయినర్

రోడ్డు నిర్మాణ వాహనాలను తగలబెట్టిన మావోయిస్టులు

ప్రజాశక్తి-చింతూరు

చత్తీస్ఘడ్ -మహారాష్ట్ర సరిహద్దులోని మహారాష్ట్ర రాష్ట్రం గచ్చిరోలి జిల్లా, యతపల్లి అటవీ ప్రాంతంలోని మారుమూల గ్రామాలైన సూరజ్గడ్, ఓలెంగా గ్రామాల మధ్య రోడ్డు పనులు నిర్వహిస్తున్న మూడు వాహనాలను మావోయిస్టులు శుక్రవారం అడ్డుకొని తగలబెట్టినారు. హెటరీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గతంలో అనేకసార్లు మావోయిస్టులు రహదారి పనులను ఆపివేయాలని హెచ్చరిక కూడా చేయడం జరిగింది.

సంతల్లో చింతపండు విక్రయాలు ఆరంభం

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీలో చింతపండు సీజన్ మొదలైంది. గిరిజన రైతులు చింతపండును వారపు సంతల్లో విక్రయాలు మొదలుపెట్టారు. మార్చి, ఏప్రిల్, నెలలో ఏజెన్సీ అంతట ముమ్మరంగా చింతపండు క్రయవిక్రయాలు జరుగుతాయి. మన్యంలో ఏటా విస్తారంగా అమ్మకాలు జరిగే చింతపండు కొనుగోలు కోసం మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు ప్రత్యేకంగా వచ్చి సంతల్లో కొనుగోలు చేస్తుంటారు. ఏజెన్సీ సంతల్లో చౌకగా చింతపండు దొరకడమే కాకుండా నాణ్యమైన చింతపండును ఎంపిక చేసి కొనుగోలు చేసుకోవడం కోసం వినియోగదారులు ఆరాట పడుతుంటారు.

విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల వ్యాపారులు, వినియోగదారులు పాడేరు ఏజెన్సీ నుంచే చింతపండును దిగుమతి చేసుకుంటారు. రానున్న రెండు నెలల పాటు ఇక్కడ వారపు సంతల్లో చింతపండు క్రయ విక్రయాలు జోరుగా సాగుతాయి. ఏజెన్సీలో పెద్ద ఎత్తున జరిగే చింతపండు విక్రయాలకు గిరిజన సహకార సంస్థ నిర్ణయించే ధర కీలకంగా ఉంటుంది. ఈ ధరను బట్టే సంతల్లో లభ్యమయ్యే చింతపండు నాణ్యతకు తగ్గట్టుగా రూ.50లకు పైగా కిలో చింతపండుకు ధర పలుకుతుంది.

కొనుగోలు ప్రారంభించిన జిసిసి

ప్రస్తుతం పాడేరు, చింతపల్లి, గిరిజన సహకార సంస్థ డివిజన్లో చింతపండు కొనుగోళ్లను ఈ సంస్థ ప్రారంభించింది. కిలో చింతపండుకు రూ.32, పిక్క తీసిన కిలో చింతపండుకు రూ.63 చొప్పున జిసిసి ధర ప్రకటించింది. ప్రస్తుతం పాడేరు ఏజెన్సీలో చింతపండు దిగుబడిని పరిశీలిస్తే కొంత తక్కువగానే ఉందని జిసిసి డివిజనల్ మేనేజర్ కే.పార్వతమ్మ తెలిపారు. దిగుబడి అంచనా మేరకు జిసిసి ద్వారా ఈ ఏడాది 200 మెట్రిక్ టన్నుల చింతపండు కొనుగోలు చేసే ఆస్కారం ఉందని ఆమె తెలిపారు. అంతకంటే ఎక్కువగా కూడా చింతపండు కొనేందుకు సిద్ధమైనట్లు ఆమె తెలిపారు.





చింతపండు తీసుకొస్తున్న మహిళ



నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:సంక్షేమ హాస్టల్లో మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ అరకులోయ ప్రభుత్వ జూనియర్ కాలేజి వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.సిమోన్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల హాస్టల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు నామమాత్రంగా మెస్ ఛార్జీలు పెంచారరన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నూతన మెనుకి పెంచిన ఛార్జీలు ఏ మాత్రం సరిపోలేదన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి గిరిజన సంక్షేమ హాస్టల్స్లో చదువుతున్న విదార్థులకు పౌష్టికాహారం అందించేందుకు విధంగా చూడాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరకువేలి ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ కె.ధనలక్ష్మి, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు కె.రవి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు .



నిరసన చేపడుతున్న నాయకులు

రేషన్ బియ్యం పంపిణీ చేయాలని
గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించిన డిపో సేల్స్ మెన్, డీలర్ పై చర్యలు తీసుకోవాలని అరకులోయ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు పాంగి నానిబాబు, సిహెచ్ గురుమూర్తి మాట్లాడుతూ, మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధి దండబాడు, దుక్కగుడా గ్రామాలకు డిసెంబర్ నెలలో పంపిణీ చేయవలసిన ఉచిత బియ్యం 100 మంది రేషన్ కార్డు దారులకు నేటికీ పంపిణీ చేయలేదన్నారు. గిరిజన ప్రాంతంలో రేషన్ బియ్యంపై పేద ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. అరకులోయ మండలంలోని డిపో పరిధిలో జిసిసి మేనేజర్ పర్యవేక్షణ లేక పోవడంతో ఉచిత బియ్యాన్ని పక్క దారి పట్టిస్తున్నారని వాపోయారు.తక్షణమే సేల్స్ మెన్, డీలర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కె.దేవన్న, రేషన్ కార్డుదారులు కృష్ణ, రాజు తదతరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కేశవరం గ్రామంలో కట్టెల పొయ్యి మీద గ్యాస్ సిలిండర్ పెట్టి, ఖాళీ సిలిండర్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. సామాన్యులపై భారాలు వేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు మేలిన రమేష్, మనుగుల రాజబాబు, లోతా శ్రీను, లోతా వెంకటలక్మి మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్యులపై మోడీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్పై రూ.50, వాణిజ్య సిలిండర్పై రూ.350 పెంచడం దారుణమన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియడంతో బిజెపి ప్రభుత్వం ప్రజలపై అమాంతంగా గ్యాస్ భారం మోపిందని విమర్శించారు. రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమన్నారు. మోడీ ప్రభుత్వం రాకముందు వంట గ్యాస్ బండ ధర రూ.417 ఉండగా, నేడు రూ.1150కు పెరిగిందని తెలిపారు. పెరిగిన ధర సబ్సిడీ రూపంలో ఇస్తామని తొలిత చెప్పిన మోడీ ప్రభుత్వం గత రెండేళ్ల నుండి సబ్సిడీ నిలిపివేసిందని విమర్శించారు. వాణిజ్య సిలిండర్ ధర పెంపు చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, ప్రజలపై భారాలు మోపుతోందని ధ్వజమెత్తారు. కేంద్రం పెంచిన గ్యాస్ ధరలు తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లోతా అర్జున్, మేలిన గంగ, ఎం.శివ, పి వెంకటరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



పొయ్యి మీద గ్యాస్ సిలిండర్ పెట్టి, ఖాళీ బండలతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సిపిఎం నేత రాజారెడ్డి మృతి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని దారపల్లి గ్రామానికి చెందిన సిపిఎం శాఖ మాజీ కార్యదర్శి అందాల రాజారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సిపిఎం మండల కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రాజారెడ్డి భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు సోడి మల్లయ్య, పలువురు కార్యకర్తలు శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. రాజారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రాజారెడ్డి మరణం సిపిఎంకు, కుటుంబానికి తీరని లోటని వారు విచారం వ్యక్తం చేశారు. రాజారెడ్డికి కుమారులు కన్నెపరెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, కూతురు నాగమణి, పద్మ ఉన్నారు.

కోడిపందేల శిబిరాలపై దాడి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : కొంతకాలంగా మండలంలోని వేటుకూరు గ్రామ సమీపాన కోడి పందాలు జరుగుతున్న ప్రాంతంపై గురువారం సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు మారేడుమిల్లి ఎస్ఐ ఎన్.రాము పోలీసులు దాడి చేశారు. ఇద్దరు జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుండి రెండు కోడి పుంజులు, రూ.470 నగదు, రెండు మోటార్ వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మోటార్ వాహనాలను సీజ్ చేసి గేమింగ్ యాక్ట్ 1974 ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితులను సొంత పూచీకత్తులపై స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

నేలజర్త పాఠశాలలో ఆగిన మధ్యాహ్న భోజనం

-ఏడాదికి పైగా బిల్లులు, వర్కర్ జీతం పెండింగ్
-ఎన్నిసార్లు మెరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు
-తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా ఎంఇఒ నిర్లక్ష్యం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ పరిధి నేలజర్త గ్రామంలో ఉన్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో మూడు రోజుల నుండి మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. ఏడాదికి పైగా మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు, వంట చేసే వర్కర్కు జీతాలు ఇవ్వకపోవడంతో ఆమె వంట గదికి తాళం వేసి తన నిరసన తెలిపింది. దీనికి సంబంధించి స్కూల్ కమిటీ చైర్మన్ కొర్ర అప్పారావు, గ్రామస్తులు మార్కు రాజు తెలిపిన వివరాల ప్రకారం....

నేలజర్త ఎంపీపీ స్కూల్లో 54 మంది విద్యార్థులు చదువుతుండగా, వారికి కిమిడు అమ్మోజీ అనే వర్కర్ క్రమం తప్పకుండా మధ్యాహ్న భోజనం వండి పెడుతోంది. అయితే 2021 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు అంటే 14 నెలలకు పైగా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, వర్కర్కు జీతం ప్రభుత్వం చెల్లించలేదు. బిల్లులు, జీతం చెల్లించాలని అమ్మాజీ అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. విసిగిపోయిన, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అమ్మాజీ బుధవారం వంటగదికి తాళం వేసింది. దీంతో బుధవారం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. ఈ విషయంపై జీకే వీధి ఎంఈఓ చంద్రశేఖర్ను కలిసేందుకు గ్రామస్తులు, వర్కరు అమ్మాజీ వెళ్లగా ఆయన కార్యాలయంలో లేరు. దీంతో ఆయనకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేయగా, 'నేను కార్యాలయంలో లేను. వేరే ఊరు వెళ్లాను. ఆఫీసులో ఫిర్యాదు చేయండి' అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టలేదని ఫిర్యాదు చేస్తే వర్కరుకు నచ్చజెప్పి భోజనం వండి పెట్టించే ఏర్పాటు చేయాల్సిన ఎంఇఒ తనకు సంబంధం లేనట్లు వ్యవహరించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. ప్రభుత్వం విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు, వర్కరు జీతం చెల్లించలేని దుస్థితిలో ఉందని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనం పెట్టకుంటే శనివారం నుంచి తమ పిల్లల్ని బడికి పంపించకుండా పూర్తిస్థాయిలో నిలిపివేస్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు. ఇప్పటికైనా ఎంఈఓ చంద్రశేఖర్, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బిల్లులు, వర్కర్ జీతం చెల్లించి, మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

60 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో కొత్త కాలనీ గ్రామ శివారులో శుక్రవారం ఉదయం 60 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మారేడుమిల్లి ఎస్ఐ ఎన్ రాము కథనం మేరకు జిల్లాలోని జికె.వీధి మండలం దారకొండ నుండి మారేడుమిల్లి మీదగా ఆటోలో తెలంగాణ రాష్ట్రానికి గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నిందితులు వనుకుందు రాజు, లౌద్య రవీంద్రను అరెస్టు చేశారు. వారి నుండి 60 కేజీల గంజాయి, రెండు సెల్ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారుగా రూ.1,80,000 ఉంటుంది. ఆటోను సీజ్ చేశారు. నిందితులను కోర్టుకు తరలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు రాజు, పంచాయతీ కార్యదర్శి విజయ్, వీఆర్వో లచ్చన్న దొర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

ప్రజా ఉద్యమాలకు పూర్తి అండగా ఉంటా

ఎమెల్సీ ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - అరిలోవ : ప్రజాఉద్యమాలకు అండగా ఉండి పోరాడడమే తన అభిమతమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే ఆరిలోవ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద ప్రజాసంఘాల నాయకులతో కలిసి ముడసర్లోవ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమస్యలపై తనకు సమగ్రమైన అవగాహన ఉందని, తాను గెలిస్తే వాటిపై మండలిలో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.నీతి, నిజాయితీలకు కట్టుబడి, ప్రజాసమస్యలపై చిత్తశుద్ధితో పోరాడడం, ప్రజలకు అండగానిలవడం పిడిఎఫ స్వభావమని, దానికి శతశాతం కట్టుబడి తాను పనిచేస్తానన్నారు.

విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు రావాల్సిన విశాఖ కేంద్రంగా రైల్వేజోన్,సుజల స్రవంతి, విశాఖకు మెట్రోరైల్ ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ సాధనకు తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన 250 ప్రజాసంఘాల అండతో, వారిని సమన్వయం చేసుకుంటూ, ముందువరుసలో నిలబడి పోరాడి, సాధించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీనిచ్చారు.

నేటి పాలకులు ఉత్తరాంధ్రకు చేసిన అన్యాయం, మోసంపై నిజాయితీగా పోరాడతానన్నారు. ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ సీరియల్‌లో 11వ నెంబర్‌లో ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఆర్‌కెఎస్‌వి.కుమార్, శంకరరావు, నరేంద్ర కుమార్, కె.సత్యనారాయణ, వి.కృష్ణమూర్తి, రంగమ్మ, భూలోకరావు, ఆదినారాయణ, మోహనరావు, గణపతి పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ



అచ్యుతాపురంలో సిఐటియు, ప్రజాసంఘాల ప్రచారం

రమాప్రభకు మద్దతుగా ప్రజాసంఘాల నేతల విస్తృత ప్రచారం

డుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ స్థానిక సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కించుమండ, అరుకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గొంతెత్తి మాట్లాడే పిడిఎఫ్ అభ్యర్థినిని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు

తగరపువలస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం తగరపువలసలోని పలు ప్రాంతాల్లో సిఐటియు నేతలు రవ్వ నరసింగరావు, ఎస్ శ్రీనివాసవర్మ, సోమి వెంకట్, ప్రజాశక్తి భీమిలి డివిజన్ కోఆర్డినేటర్ ఆర్ వెంకటరమణ కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

98వ వార్డులో విస్తృత ప్రచారం

సింహాచలం: ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ రమాప్రభను గెలిపించాలని కోరుతూ 98వ వార్డులోని పలు ప్రాంతాల్లో సిపిఎం, సిఐటియు, ఇతర ప్రజాసంఘాలతో పాటు ప్రజారైతు సంక్షేమ సంఘం సభ్యులు ప్రచారం నిర్వహించారు.

చోడవరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గోవాడ ఫ్యాక్టరీ, చోడవరం చందక వీధి, వెలమ వీధి ప్రాంతాలో ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్వి నాయుడు, కోవెల శ్రీను, వై గణేష్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభకు తొలి ప్రాధాన్యత ఓట్లు వేయాలని అచ్యుతాపురం మండల కేంద్రంలో శుక్రవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కే సోమినాయుడు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిశారు.

బుచ్చయ్యపేట : ప్రజా సంఘాల ఉమ్మడి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సిఐటియు మండల కార్యదర్శి పి. సాంబశివరావు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని రాజాం, నీలకంఠాపురం, తైపురం, చిట్టి పాలెం, తురకలపూడి, సీతయ్యపేట ప్రచారం చేశారు.

మునగపాక రూరల్ : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మునగపాకలో గురువారం రాత్రి సిఐటియు నాయకులు ఎస్ బ్రహ్మాజీ, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం చేపట్టారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే రమాప్రభను 250 ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు టెక్కలి జగ్గారావు, పెంటకోట సత్యనారాయణ, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకుబహుజన ఐక్యవేదిక మద్దతు

నర్సీపట్నం టౌన్: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభకు తమ మద్దతు ఉంటుందని నర్సీపట్నం బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా నాగరాజు తెలిపారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షాన ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులను పార్టీలకు అతీతంగా ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపు నిచ్చారు. నెల్లూరి చిరంజీవి, కొల్లు గంగాధర్, సంజీవ్ పాల్గొన్నారు.

కొత్తకోట : ఉద్యోగ, ప్రజా కార్మిక సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రావికమతం మండలంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి పాడి బెన్నయ్య, డోల కళ్యాణ్ కుమార్, సింగరపు వలసయ్యలు అర్జాపురం, బెన్నవరం, కొట్నాబిల్లి గ్రామాలలో ప్రచారం చేశారు.



భీమిలిలో ...



చోడవరంలో...



మునగపాకలో...

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎఐటియుసి ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు బస్ స్టాండ్ వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్‌వి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రయాణికుల దాహార్తించేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు చెప్పారు. తాగునీరుతోపాటు, మజ్జిగ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పాడేరు పట్టణ ప్రజలతోపాటు జిల్లా కేంద్రానికి వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు దీన్ని ఏర్పాలు చేస్తున్నటుల వెల్లడించారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ అమర్, జిల్లా కార్యదర్శి ఎం.లక్ష్మణ్, ఎఐవైఎఫ్ నాయకులు మున్నా, శివకుమార్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' వినతులపై నిర్లక్ష్యం

- 8 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు



మాట్లాడుతున్న కలెక్టర్ కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 62 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ, సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి అభిషేక్‌లతో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. తాగునీటి సదుపాయాలు, భూ సమస్యలు, రహదారి సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు, అటవీ హక్కుల పత్రాలు, ఇళ్ల స్థలాలు మంజూరు వంటి సమస్యలపై అధికంగా వినతులు అందాయి.

పాడేరు మండలం ముల్లగరువు గ్రామానికి చెందిన మదర్ తెరిసా గ్రామ సమన్వయ సంఘ సభ్యులు, తమ గ్రామంలో మురుగునీటి కాలువ నిర్వహణకు అర్జీ సమర్పించారు.డుంబ్రిగుడ మండలం రంగిలిసింగి పంచాయతి కింజేరు గ్రామానికి చెందిన కొర్రా పద్మ తమ భూమికి పట్టా వున్నా ప్రభుత్వం నుండి వచ్చే రైతు భరోసా పడటం లేదని ఫిర్యాదు సమర్పించారు. అనంతగిరి మండలం లుంగపర్తి గ్రామ పంచాయతీ రాయపాడు గ్రామస్తులు తమ గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్పందన పై సకాలంలో స్పందించని ఎనిమిది మంది అధికారులకు కలెక్టర్ సుమిత్ కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇంకో సారి అలక్ష్యంగా ప్రవర్తిస్తే క్రమ శిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో అందిన ఫిర్యాదులపై సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్నకు చెబుతాం జె.కె.సి పోర్టల్ ద్వారా స్పందన ఫిర్యాదులు కూడా ముఖ్యమంత్రి దృష్టికి వెళ్తున్నందున అధికారులు అందరూ ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి, అధికారితో సహా అందరూ ఫేషియల్ రికగ్నిషన్ విధానంలో హాజరు నమోదు చేయాల్సిందేనని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. చాలా కార్యాలయాలలో ఎఫ్ఆర్ఎస్ నమోదు కూడా చేయని సిబ్బంది ఉన్నారని, అటువంటి వారంతా వెంటనే నమోదు చేసుకుని ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు ముందుగా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. డ్రాయింగ్ అధికారులు సిబ్బంది ఎఫ్ఆర్ ఎస్ హాజరు ఆధారంగా సిబ్బందికి జీతభత్యాలు చెల్లించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఈడి వి.ఆర్.ఎం రాజు, కె.వేణుగోపాల్, పంచాయతీ రాజ్ ఇఇ కే.లావణ్య కుమార్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఐక్యతకు రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గాస్పెల్, క్రైస్తవులు ఐక్యత కలిగి ఉండాలన్న లక్ష్యంతో చేస్తున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమంపై శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కారుణ్య చర్చిలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రన్ ఫర్ జీసస్ రంపచోడవరం డివిజన్ కో-ఆర్డినేటర్ ఆరోగ్యరాజు, పాడేరు, అరకు నియోజకవర్గాల కో-ఆర్డినేటర్ లు బిషప్ సిహెచ్.దైవకప, బిషప్ సంజీవకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆరాధన టివి ఛానల్ పిలుపుతో ప్రతి ఏటా ఈ కార్యక్రమం ఆయా ప్రాంతాల్లో జరుగుతోందని తెలిపారు. క్రైస్తవులు ఐక్యత కలిగి ఉండడమే రన్ ఫర్ జీసస్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఏప్రిల్ 8న జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాలతో పాటు ఆయా ప్రాంతాల్లో నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం రన్ ఫర్ జీసస్ కో-ఆర్డినేటర్ లుగా పాస్టర్స్ పి.ఫ్రెడ్రిక్, ఎం.బాబురావు, పి.డేవిడ్, పాపిట్ రాజు, యుసివైసి ఫౌండర్ అండ్ చీఫ్ ఆర్.జాన్, సలహాదారు బి.ఎలీషారావు తదితరులను నియమించారు.

ఘనంగా పెట్టుబడుల సదస్సు ప్రారంభం



సమ్మిట్ వేదికపై సిఎం జగన్, పారిశ్రామికవేత్తలు

తొలి రోజు రూ.11.85 లక్షల కోట్లతో 92 ఎంఒయులు
తరలొచ్చిన అంబానీ, కరన్ అదానీ, జిఎంఆర్, పలువురు పారిశ్రామికవేత్తలు
సుస్థిర ప్రగతిలో ఎపి ముందంజ : సిఎం జగన్
త్వరలో విశాఖ నుంచే పాలనని పునరుద్ఘాటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు తలపెట్టిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, అదానీ పోర్ట్స్ సిఇఒ కరన్ అదానీ, జిఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, జిందాల్, అదిత్యా బిర్లా గ్రూప్, అరబిందో గ్రూప్, డైకిన్, ఎన్‌టిపిసి, ఐఒసిఎల్ కంపెనీల ప్రతినిధులు, పలువురు విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. సమ్మిట్‌ను ప్రారంభిస్తూ సిఎం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. 'మీ వ్యాపారాలకు, పెట్టుబడులకు నాది హామీ. పరిశ్రమ మీది.. ప్రోత్సాహం మాది. దేశంలోనే సుస్థిర ప్రగతిని సాధించే అగ్రగామి రాష్ట్రంగా ఎపిని తీసుకెళ్లడమే నా లక్ష్యం' అని ఆయన ఉద్ఘాటించారు. త్వరలో విశాఖ నుంచే తమ పాలన సాగుతుందన్నారు.

సమ్మిట్ విశేషాలు

సమ్మిట్ వేదికపై వైఎస్ జగన్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ మధ్య ఎడతెరిపి లేని చర్చలు జరిగాయి. సుమారు 20 మంది జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రతినిధులు ఓ వైపు ప్రసంగాలు చేస్తుండగానే వీరిద్దరి మధ్య వ్యక్తిగతంగా సంభాషణ సాగింది. మరోవైపు ఈ సమ్మిట్ ద్వారా రూ.2 లక్షల కోట్లు పెట్టుబడులు సమీకరిస్తున్నట్లు నెల రోజుల నుంచీ వివిధ సందర్భాల్లో ప్రభుత్వ పెద్దలు గుడివాడ అమర్‌నాథ్, వైవి.సుబ్బారెడ్డి చెబుతూ వచ్చినా సమ్మిట్ రోజు శుక్రవారం సిఎం వైఎస్ జగన్ రూ.13 లక్షల కోట్లు ఎంఒయులు అని ప్రకటించగానే సభికులంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. వెంటనే తేరుకుని చప్పట్లు కొట్టారు. ఊహలకందని లెక్కలు ఎలా వచ్చాయి ? ఎక్కడ తయారయ్యాయి ? అంటూ సభికుల్లో చర్చ జరిగింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిర్వాహకులు అందజేసిన కిట్ల కోసం సభా ప్రాంగణంలో గలాటా చోటుచేసుకుంది. ప్రతినిధులకు విధిగా అందజేయాల్సిన కిట్‌లు సకాలంలో వారికి అందలేదు. కిట్ల పంపిణీ వద్దకు కొంతమంది ప్రతినిధులు వచ్చి తమకు అందలేదని వాదనకు దిగారు. నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అక్కడి టెంట్లను పీకేశారు.

రాష్ట్ర పారిశ్రామిక రంగ ప్రగతికి చిహ్నంగా నిలిచిన ప్రదర్శన

సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రంలో వివిధ పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, మహిళా సంఘాలు, హస్త కళాకారులు ఉత్పత్తి చేసిన, తయారు చేసిన వస్తువులు, కళాకృతుల ప్రదర్శన అన్ని రంగాల్లో ఎపి ప్రగతిని ప్రతిబింబించింది. ఇందులో మొత్తం వివిధ ప్రభుత్వ, పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు 137 స్టాళ్లను ఏర్పాటు చేశాయి. సిఎం జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర ఉపరితల రవాణా, పోర్టులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం పారిశ్రామిక, వాణిజ్య ప్రదర్శనలో ఏర్పాటు చేసిన అన్ని స్టాళ్లను వారు సందర్శించి ఆయా స్టాళ్లలో ప్రదర్శించిన అంశాలను తెలుసుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎపి పెవిలియన్

ఈ ప్రదర్శనలో ఎపి పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో శ్రీసిటీలో వివిధ పరిశ్రమల ద్వారా తయారు చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు, ఇతర ఉత్పత్తులను ప్రదర్శించారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ రాష్ట్రంలోని కళలు, హస్తకళలు, పర్యాటక ప్రదేశాల విశేషాలతో ఆకట్టుకుంది. ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తదితర సంస్థలు కూడా తమ స్టాళ్లు ఏర్పాటు చేశాయి. సెంచూరియన్ యూనివర్శిటీ వంటి ప్రైవేటు విద్యా సంస్థలు కూడా స్టాళ్లు ఏర్పాటు చేశాయి. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ తమ స్టాల్ లో ఏర్పాటు చేసిన సైనిక హెలికాప్టర్లు, తేజస్ యుద్ధ విమానం నమూనాలు, ఇతర సైనిక ఉత్పత్తులను ప్రదర్శించింది.

గ్రామ వార్డు సచివాలయాలు, నైపుణ్యాభివృద్ధి, ప్రకృతి వ్యవసాయం, మహిళా స్వయంశక్తి గ్రూపులు, ఆప్కో, ఎపి ఇన్నోవేషన్ సొసైటీ, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర ప్రభుత్వ శాఖలు తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ఐటిసి ఉత్పత్తులు, కియా ఎలక్ట్రిక్ కార్ల ప్రదర్శన, సౌర విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి సెంబ్ కార్ప్ తదితర స్టాళ్లు ఆకట్టుకున్నాయి.



సమ్మిట్‌కు హాజరైన విదేశీ ప్రతినిధులు

కార్యక్రమంలో మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఉషశ్రీ చరణ్, విడదల రజని, ఆర్‌కె.రోజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చేనేత జౌళి శాఖ కార్యదర్శి సునీత, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

సమ్మిట్ ప్రారంభానికి ముందు ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృతికి అద్దం పట్టేలా నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ సాంప్రదాయ నృత్యాలైన వీరనాట్యం, తప్పెట గుళ్లు, బుట్ట బొమ్మలు, కోలాటం, థింసా, లంబాడీ నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం సభా వేదికపై 50 గ్రౌండ్లతో నిర్వహించిన లేజర్ షో విశేషంగా ఆకట్టుకుంది.

పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు

డిజిపి కె.రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 2500 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. సిరిపురం రోడ్డు నుంచి ఎస్పీ బంగ్లా రోడ్డు ద్వారా అతిథులకు ప్రవేశం కల్పించారు అదేవిధంగా ఆంధ్ర యూనివర్సిటీలోని వైవిఎస్.మూర్తి ఆడిటోరియం ద్వారా ప్రభుత్వ అధికారులకు ప్రవేశం కల్పించారు. ఎక్కడికక్కడ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు.

సదస్సులోకి అనధికార వ్యక్తులు

- సౌకర్యాల కల్పనలో నిర్వాహకులు విఫలం

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడిదారుల కన్నా అనధికార వ్యక్తులే అధికంగా కనిపించారు. ఎయు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఐదు ప్రాంగణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టినా అనధికార వ్యక్తులు సమ్మిట్ ప్రాంగణంలోకి వచ్చేశారు. సదస్సు ప్రారంభమైన కొద్దిసేపటికే చాలా మంది ఒక్కసారిగా ప్రాంగణంలోకి ప్రవేశించారు. దీంతో కొన్నిచోట్ల తోపులాట కూడా చోటు చేసుకుంది. కొంతమంది తమకు క్యూఆర్ కోడ్ వచ్చిందని, తమ వాళ్లు లోపలున్నారని, వారి వద్ద పాసులున్నాయని చెప్పుకొచ్చారు. ఇంకొంతమంది డెలిగేట్స్ పాస్‌లతో ప్రత్యక్షమయ్యారు. నిజానికి డెలిగేట్స్ పాస్‌లు ఉన్నవారికి మధ్యాహ్నం మూడు తర్వాత ప్రవేశం అని ముందుగా ప్రకటించినా కొంతమందికి సమాచారం అందకపోవడంతో వారు ఉదయాన్నే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. నిర్వాహకులు సామాన్యులకు, వ్యాపారవేత్తలకు అందరికీ డెలిగేట్స్ పాస్‌లు ఇవ్వడంతో వ్యాపారవేత్తలను పోలీసులు గుర్తించడం కష్టంగా మారింది. దీంతో చేసేదేమీలేక పోలీసులు అందరినీ లోపలికి అనుమతించారు. నిర్వాహకులు బార్ కోడ్‌ల సహాయంతో పాస్‌లు జారీ చేశారు. స్కానర్‌లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక కొంతమందికి సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో క్యూఆర్ కోడ్ చూపిస్తే లోపలకు అనుమతించారు. ఐడి కార్డులుంటేనే లోపలకు అనుమతిస్తామని పోలీసులు చెప్పినప్పటికీ ప్రధాన ద్వారం వద్ద ఒకేసారి జనం గుంపులు గుంపులుగా వచ్చేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని చెప్పి దబాయించి చాలా మంది లోపలకు వచ్చేశారు.

సౌకర్యాల కల్పన విషయంలో నిర్వాహకులు విఫలమయ్యారు. సభ ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్న సమాచారంతో అల్పాహారం ఉంటుందేమోనని చాలా మంది ఆశించారు. అప్పటికప్పుడు విమానాలు దిగి, సభా ప్రాంగణం వద్దకు చేరుకున్న డెలిగేట్స్‌కు తినేందుకు ఏమీ దొరకలేదు. మూత్రశాలల వద్ద నీటి సౌకర్యం సరిగా లేదు. లోపల ఏర్పాటు చేసిన కౌంటర్లో డబ్బులిస్తేనే ఫుడ్ అందిస్తామంటూ కొన్ని ప్రైవేట్ స్టాళ్ల నిర్వాహకులు చెప్పడంతో కొంతమంది ఇబ్బంది పడ్డారు. అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రాంగణంలోకి ధుమ్మూ ధూళి యథాతథంగా వచ్చేయడంతో నిర్వాహకులపై సమ్మిట్‌కు వచ్చిన వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌కు పక్కా భవనం నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి పక్కా భవనం నిర్మించి, మీటింగ్ సందర్భంగా వర్కర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం ఐటిడిఎ కార్యాలయం ముందు అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కూనవరం నుండి విడదీసి పదేళ్లు అవుతున్నా నేటికీ చింతూరు ప్రాజెక్ట్‌కు పక్కా భవనం నిర్మించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రతి నెల ప్రాజెక్ట్ మీటింగ్‌కు మండలంలోని మారుమూల ప్రాంతాల నుండి వస్తున్న వర్కర్లు ఎక్కడ కూర్చోవాలో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సారి కాలేజీలో, మరోసారి ఎంపీడీఓ ఆఫీస్‌లో ఇలా ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ అధికారులు మీటింగ్ పెట్టడంతో వర్కర్లకు మంచి నీరు, బాత్‌రూమ్స్ వంటి కనీస సౌకర్యాలు లేక రోజంతా అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వీరంతా మహిళలు కావడంతో సమస్యను చెప్పుకునేందుకు బాధపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఐటిడిఎస్ ప్రాజెక్ట్‌కు పక్కా భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ ఎఒకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎఒ కె.సుజాత మాట్లాడుతూ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు సావిత్రి, దుర్గ, వెంకటరమణ, జయ, కామేశ్వరి, పొద్దమ్మ, పార్వతి, భద్రమ్మ, నూకరత్నం, స్వరూప, ఝాన్సీ, శేషమ్మ, విజయ, కుమారి, కామేశ్వరి, రాములమ్మ, కిట్టమ్మ, కనకమహాలక్ష్మి, లలిత, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: గ్యాస్ ధర తగ్గించాలని మండల వైస్ ఎంపీపీ 1 పాటుబోయి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ రూ.50, వాణిజ్య సిలిండర్ ధరను రు.350 పెంచడం తగదన్నారు. నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయని, ఈ పరిస్థితిలో. గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో రూ.417 ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర నేడు రూ.1155కు పెరిగిందన్నారు. వాణిజ్య సిలిండరుకు ఒక్కసారిగా రు.350 పెంచడంతో స్వయం ఉపాధి పొందుతున్న వారు నష్టపోతున్నారని, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు, సోలగం గాసిరం దొర, వంతల లైకోన్, రాజేంద్ర, లోకినాథ్ పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సిసి రోడ్లు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి బాబు వెల్లడించారు. ఇప్పటికే నిర్మించిన సిసి రోడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, వైసిపి కార్యకర్తలు బుజ్జి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

దార్లగుందితో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం, గుమ్మిరేవుల పంచాయితీ, దార్లగుంది గ్రామంలో శుక్రవారం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డికె.హిమబిందు ఆధ్వర్యాన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న 106 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తనిఖీలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న బాలింత మర్రి గుండమ్మను వైద్యాధికారి హిమబిందు బలవంతంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.